క్లుప్తంగా

ముమ్మరంగా పీపీఆర్ టీకాలు

అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని ఉత్తనూరులో గొర్రెలకు, మేకలకు వెటర్నరీ సిబ్బంది టీకాలు వేశారు. మొత్తం 853 గొర్రెలకు, 36 మేకలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు.

దుస్తులు పంపిణీ



గద్వాల అర్బన్: దీపావళి పండుగను పురస్కరించుకోని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీలో ఫౌండర్ పరశురాముడు దుస్తులు పంపిణీ చేశారు. చిన్నారులకు టపాసులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

దీపావళి కిట్స్ అందజేత

దీపావళి పండుగను పురస్కరించుకోని ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని రెండో రైల్వేగేటు కాలనీలో పేద పిల్లలకు దీపావళి కిట్స్, పండ్లను న్యాయవాది వరలక్ష్మీదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది పేద పిల్లలకు ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ దీపావళి కిట్స్ అందజేస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు గిరిబాబు, ఉనంద్, వినయ్, సుదర్శన్ ఉన్నారు.

మద్యం తరలిస్తే కఠిన చర్యలు

మానవపాడు: అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాము హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బోరవెల్లి గ్రామానికి మద్యం తరలిస్తున్న వెంకటేష్‌ను పట్టుకున్నారు. 12.78 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.14,058 ఉంటుందని పోలీసులు తెలిపారు. బెల్టు షాపుల్లో ఎవరైనా మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీస్‌లు ఉన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

గద్వాల అర్బన్: గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి, కొత్తపల్లి, గుంటిపల్లి, రేకులపల్లి తదితర గ్రామాల్లో గద్వాల కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అయిజ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నకుమార్ ఆదివారం మండలంలోని మేడికొండ, పులికల్, రాజాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ధరూరు: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి గొంగ్లల రంజిత్‌కుమార్ కొత్తపాలెం, కొత్తపాలెం తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడులో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా జిల్లా యువజన అధ్యక్షుడు దీపక్‌ప్రజ్ఞ ఇంటింటి ప్రచారం చేశాడు.

ఉండవెల్లి: మండలంలోని మెన్నిపాడు, తక్కశిల గ్రామాల్లో బీఎస్పీ పార్టీ అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసన్నకుమార్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బైరాపురం, బస్వాపురంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్ భార్య మహాలక్ష్మి ప్రచారం నిర్వహించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణీ, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, జ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు

రేపు నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం

శాంతినగర్: ఈనెల 15న నాయీబ్రాహ్మణుల ఆత్మీయసమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఉమ్మడి వడ్డేపల్లి మండల నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో బుధవారం 3 గంటలకు ఉంటుందని తెలిపారు. నాయీబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు బ్యాండ్ ఆంజనేయులు కోరారు.

పోలీసులకు ఫిర్యాదు

శాంతినగర్: పంచాయతీ కార్యదర్శిపై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే కారణంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రామాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ విధుల్లో ఉండగా గ్రామానికి చెందిన వ్యక్తి సంతకం విషయమై పంచాయతీ కార్యదర్శి వద్దకు వచ్చాడు. తాను సంతకం పెట్టలేనని చెప్పడంతో ఆగ్రహించిన వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు అసభ్యంగా మాట్లాడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

పాగుంటస్వామి జాతర ప్రారంభం

- ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం, ప్రభోత్సవం



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గతేడాదితో పోల్చితే ఈసారి భక్తుల రద్దీ పెరిగిందని, ఆలయ అధికారులు తెలిపారు. కొండపై, దిగువన ఎటు చూసినా భక్తజన సందోహమే కనిపించింది. ఈ ప్రాంత ప్రజల ఇలవేల్పుగా కొలిచే లక్ష్మీవేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాసంగాలతో పాటుగా తలనీలాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణ మధ్య ప్రభోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శేషిరెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, గోపి, శ్రీనివాసులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదానం



ఆలయానికి శాశ్వత అన్నదానం కోసం విరాళం అందజేసిన భక్తులు

మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదానం కోసం రాయచూర్ జిల్లా యాపల్‌దిన్నె గ్రామానికి చెందిన కిష్టప్ప జమ్ములమ్మ దంపతులు రూ.1,11,111ల విరాళం ఆలయ సిబ్బందికి ఆదివారం అందజేశారు. అనంతరం వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో వారిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పాగుంటస్వామి బ్రహ్మోత్సవాలు

మండలంలోని వెంకటాపురంలోని వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఎంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ సిబ్బంది తెలిపారు. సోమవారం రాత్రి ప్రత్యేక పూజలతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు సంప్రదాయం ప్రకారం స్వామివారికి ఎమ్మెల్యే సతీమణి సర్పంచు బండ్ల జ్యోతి హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ఈఓ పురేందర్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత ఆలయ సిబ్బందిపై ఉందని, పోలీసులు బందోబస్తు సక్రమంగా నిర్వహించి ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కృష్ణకుమార్ రెడ్డి, సాయిసాకేతన్ రెడ్డి, జెడ్పీటీసీ పద్మ, సర్పంచు ఆంజనేయులు, నాయకులు గోపి, నవీన్‌కుమార్ రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పాగుంటస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



గోపల్‌దిన్నెలో ఓటు వేసి ఆశీర్వదించాలని మహిళను కోరుతున్న విజయుడు

ఎర్రవల్లిచౌరస్తా: రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ చల్లా, బీఆర్ఎస్ పార్టీ అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని మొగిలి రావులచెర్వు, గోపల్‌దిన్నె, శివనంపల్లి, పెద్దదిన్నె, మునుగాల గ్రామాల్లో, సోమవారం ధర్మవరం, గార్లపాడు, కారుపాకుల, వీరాపురం, షేకుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆడిపిల్లల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ఏర్పాటు చేసిందన్నారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఏ రాష్ట్రంలో అందించనంత ఎక్కువగా పింఛన్లు అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని వారు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, జెడ్పీటీసీ హనుమంతురెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రాందేవ్‌రెడ్డి, అనంతరెడ్డి, పరమేశ్వరెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణసాగర్, రవిప్రకాష్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిరంకుశ పాలనను ఎండగడుదాం

గద్వాల అర్బన్: బీఆర్ఎస్, బీజేపీల ప్రజావ్యతిరేక, నిరంకుశ పాలనను ఎండగడుదామని టీజేఎస్ జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్‌గౌడ్, రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. టీపీజేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రైతాంగ సమితి జిల్లా నాయకులు ఖాజా, నాగరాజు, సీఎల్‌సీ జిల్లా నాయకులు సుబాన్, పాలమూరు అధ్యయన వేదిక కో కన్వీనర్ హన్మంతు, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ జయమ్మ ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



గట్టు: మండలంలోని యల్లందొడ్డిలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు మాట్లాడుతూ భగవద్గీతను బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువు అని, గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడే అని తెలిపారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అయిజ కమిటీ అధ్యక్షుడు నరేష్, సభ్యులు భాస్కర్, వీరేష్, మధు,సతీష్, విజయ్, మోహన్, గంగాధర్, లక్ష్మీ, విజయశాంతి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మానవపాడు: మండలంలోని మానవపాడు స్టేజీ సమీపంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ సక్రియానాయక్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి, ఆధారాలు లేకుండా నగదు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సక్రియా నాయక్

అన్నపై దాడి చేసిన తమ్ముడు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడుకు చెందిన వడ్డెమాన్ వెంకటేశ్వర్‌రెడ్డిపై తమ్ముడు వడ్డెమాన్ ఆంజనేయరెడ్డి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. వడ్డెమాన్ వెంకట్రామిరెడ్డి పొలంలో ఉల్లిగడ్డ నాలుగెకరాల్లో సాగు చేశాడు. నీటిబోరు ఆంజనేయరెడ్డి పొలంలో ఉండడంతో పొలానికి నీరు కడుతున్నాడు. ఆ సమయంలో తన పొలంలోని బోరు నీళ్లు కట్టుకోవద్దని తమ్ముడు చెప్పాడు. కరెంట్ తనపొలంలో ఉందని అన్న అనడంతో ఇరువురి మధ్యం మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. దీంతో తమ్ముడు అన్నపై దాడి చేశాడు. దీంతో వెంకటేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆంజయేయరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాబా యజమానిపై దాడి

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా, టోల్‌గేట్ మధ్యలో ఉన్న ఎస్ఆర్‌సీ దాబాలో దాబా యజమాని మహ్మద్ సుబాన్ అతని కుమారుడు యాసిన్‌లపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఎస్ఆర్‌సీ దాబాలో తక్కశిలకు చెందిన రవి మంచంపై పడుకున్నాడు. అతనిని లేచి పక్కకు వెళ్లి పడుకోవాలని, కస్టమర్లు వస్తున్నారని దాబా యజమాని చెప్పాడు. దీంతో తక్కశిలకు చెందిన వ్యక్తి ఈ పక్కన పంచర్ షాపు పెట్టుకున్నాడు. అతడు వచ్చాక వెళ్తానన్నాడు. దాబా బంద్ చేస్తున్నామని, వెళ్లి పోవాలని మరోసారి దాబా యజమాని సుబాన్, కుమారుడు యాసిన్ చెప్పడంతో వారిపై దాడి పాల్పడ్డాడు. రవి స్నేహితులకు ఫోన్ చేసి రప్పించి దాబాను ధ్వంసం చేసే ప్రయత్నం చేశాడు. ఈ దాడిలో ప్రసాద్, నవీన్, కిరణ్, విజయ్, రవి ఉన్నారని, సుబాన్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా దీపావళి వేడుకలు



కేటీదొడ్డిలో టపాసులు కాలుస్తున్న కుటుంబం



చెన్నిపాడులో టపాయలు కాలుస్తున్న చిన్నారులు

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో ఆది, సోమవారాల్లో ప్రజలు దీపావళి పండుగను సంప్రదాయపరంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నివాస గృహాల్లో దీపాలు వెలిగించి, బాణా సంచా కాల్చారు. పిండి వంటలతో సందడి చేశారు.

ఆలయాల్లో అమవాస్య పూజలు

ఉండవెల్లి: మండలంలోని డీ బుడిదపాడు శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వా రికి పూజ నిర్వహించారు. అంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీ సేవలో సీతారాముల విగ్రహాలు ఊరేగించారు. అనంతరం క్యాతూరు గ్రామస్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

కేటీదొడ్డి: ఇంటింటా వెలుగులు నింపే దీపావళి పండుగ వేడుకలను ఇళ్లల్లో లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు.

ధరూరు: మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామిఆలయం, పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి, తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి, కోతుల గిద్ద అరణ్జేశ్వరస్వామి ఆలయాల్లో దీపావళి, అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. పిండి వంటలతో దేవతామూర్తులకు నైవేధ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మానవపాడు: దీపావళి పర్వదినాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వాకిళ్లముందు అందమైన ముగ్గులు వేసి ప్రమిదలు వెలిగించి రంగురంగుల క్రాకర్లు, పటాస్‌లు, కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో..

కేంద్ర బలగాల కవాతు



జమిచెడ్ గ్రామంలో కవాత్తు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం గద్వాల మండలంలోని జమిచెడ్, పూడూరు, అనంతపురం గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి సీఐ శ్రీనివాస్ మాట్లాడారు. నెల 30న జరిగే ఎన్నికల ప్రక్రియలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రలోబాలకు గురిచేసే నాయకులపై నిర్భయంగా ప్రజలు ఫిర్యాదు చేయొచ్చన్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆనంద్, తదితరులు ఉన్నారు.

పల్లెల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కోదండాపురం, ధర్మవరం గ్రామాల్లో కోదండాపురం ఎస్ఐ కృష్ణదేవా ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బలగాలతో ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పోలీస్ కళా బృందం సభ్యులు ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఓటర్లకు ఎన్నికల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు ఎవరికీ భయపడకుండా తమకు ఇష్టం ఉన్నవారికి ఓటు వేసుకోవచ్చని తెలిపారు ఎవరైనా అభ్యర్థులు, వివిధ పార్టీల నాయకులు ఓటర్లపై దౌర్జన్యం చేసినా, ఇబ్బందులకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ధర్మవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారు



మాట్లాడుతున్న డీకే అరుణ, పక్కనే గద్వాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బోయ బల్గెర శివారెడ్డి

గట్టు: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ రూ.లక్ష కోట్ల అప్పుల్లోకి నెట్టివేశారని, రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అమ్మేస్తాడని, ఇలాంటి వాళ్లను నమ్మొద్దని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. బీజేపీ గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి బోయ బల్గెర శివారెడ్డితో కలిసి ఆమె శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోయలగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీకే అరుణ మాట్లాడుతూ బీజేపీ బడుగు బలహీన వర్గాలకు చెందిన బోయ బల్గెర శివారెడ్డికి అవకాశం కల్పించిందన్నారు. గద్వాల ఓటర్లు బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నెట్టెంపాడు సాధించడంతో రైతులు పంటలు పండించుకుని పచ్చగా ఉన్నట్లు తెలిపారు. బంగాల పేద వాళ్ల బంగ్లాగా, కష్టం వచ్చిన వారిని ఆదుకున్నట్లు తెలిపారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే బాధ్యత బీజేపీ తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌కు తెలంగాణ ఎమ్మార్పీఎస్ మద్దతు



మాట్లాడుతున్న జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర ఉసేన్

అలంపూర్: రాష్ట్రంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర ఉసేన్ మాదిగ తెలిపారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస మాదిగ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మద్దతుగా పని చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ మాదిగలకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కల్లి బొల్లి మాటలతో కాలయాపన చేశాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే డప్పు, చెప్పు పింఛన్‌లు, నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ రుణాలు, మంత్రి పదువులు ఇస్తామని కేసీఆర్ మాట ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నియోకవర్గ అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రేమదాసు, మల్లపోగు లక్ష్మణ్, జయన్న, ఎర్రన్న, వెంకటేష్, నరసింహ ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి వలసలు

కోస్గి: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పలువురు ప్రజాప్రతినిధులు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణంలో నిర్వహించిన సభలో వారికి కండువా కప్పారు. అలంపూర్ జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్, వడ్డేపల్లి జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఉండవెల్లి జెడ్పీటీసీ రాములమ్మ, రాజోళి జెడ్పీటీసీ సుగుణమ్మతోపాటు ముగ్గురు ఎంపీపీలు, 34 మంది ఎంపీటీసీలు, 15 మంది సర్పంచ్‌లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసినట్లు తెలిపారు. వీరితోపాటు ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, మద్దిలేటి రామ నాయుడు, జగన్మోహన్ నాయుడు, అయిజ మండల నాయకులు మేడికొండ లక్ష్మీకాంతరావుతోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవా కథనం మేరకు.. ధర్మవరం గ్రామానికి చెందిన బోయ గోవిందు (53) కడుపునొప్పిని భరించలేక ఈ నెల 11న ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

- రక్షణ గోడలు లేని కల్వర్టులు
- సూచిక బోర్డు లేని మలుపులు



రంగాపూర్ నుంచి బునాదిపూర్ వెళ్లే దారిలో సూచికలు లేని మలుపులు



వెంకటాపురం వద్ద రక్షణ గోడ లేని కల్వర్టు

పెబ్బేరు రూరల్: రక్షణ గోడలు లేని కల్వర్టులతో ప్రయాణం ప్రమా దకరంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బునాదిపూర్ శివారులో వాగుపై నిర్మించిన కల్వర్టు, బూడ్డిపాడు నుంచి అయ్యవారిపల్లికి వెళ్లేదారిలో ఉన్న రోడ్డు డ్యాంలకు, బునాదిపూర్ నుంచి రంగాపూర్‌కు, పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే దారిలో వెంకటాపురం శివారులో కల్వర్టుకు రక్షణ గోడలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న రోడ్డు డ్యాంలకు, రక్షణ గోడలు లేని కల్వర్టులతో పాటు పలు కల్వర్టులు నాణ్యతను కోల్పోయి శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

కల్వర్టుల వద్ద రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ద్విచక్రవాహనాలు, ఆటోలు, జీపులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. రహదారులపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంట బునాదిపూర్, పెంచికలపాడు, సూగూరు, యాపర్ల, రాంపురం వెళ్లే రహదారులపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని, శిథిలమైన వాటికి మరమ్మతు చేయించాలని, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు

కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన కల్వర్టులకు మరమ్మతు చేపట్టాలి.

– రమేష్, సూగూరు